క్లుప్తంగా

17న రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహప్రతిష్ట

వై.రామవరం: మండల సరిహద్దు గ్రామమైన వెదురునగరంలోని శివసాయిభువనేశ్వరి ఆశ్రమంలో ఈనెల 17న రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహాన్ని ప్రతిష్టించనున్నట్టు ఆశ్రమ నిర్వాహకులు సాయిరామ్ గురుస్వామి తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం విగ్రహప్రతిష్ట, హోమాలు, అభిషేకలు, ప్రత్యేక పూజలు చేయనున్నట్టు చెప్పారు. అనంతరం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భారీ ఎత్తున భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

దివ్యాంగుల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలి

- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



దివ్యాంగులకు చెక్కులు అందజేస్తున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ఏజెన్సీలోని దివ్యాంగులు ఆర్థికంగా అభివృద్ధి చెందేవిధంగా స్వచ్ఛంద సేవా సంస్థలు కృషి చేయాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ తెలిపారు. ఉమా మనో వికాస కేంద్రం స్వచ్ఛంద సేవా సంస్థ 15 మంది దివ్యాంగులకు సమకూర్చిన పెళ్లి కానుక చెక్కులను పంపిణీ చేశారు.ఐటీడీఏ సమావేశం హాలులో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఎ. నాయుడు, రాంజీ, చిన్ని, సౌమ్య పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు అనుమతి తప్పనిసరి

మారేడుమిల్లి : దీపావళి సందర్భంగా మండలంలో బాణసంచా విక్రయ షాపులకు ఏర్పాటు చేయాలంటే తప్పనిసరి అనుమతులు పొందాలని మారేడుమిల్లి సీఐ గోపాలకృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో పలు చోట్ల దీపావళి సందర్భంగా జరిగిన పలు సంఘటనలను దృష్టిలో పెట్టుకుని బాణసంచా విక్రయించే దుకాణదారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. పోలీసులు సూచించిన నియమనిబంధనలు తప్పని సరిగా పాటించాలని, అనుమతి లేకుండా ఇళ్ల, జన సముదాయాల మధ్య దుకాణాలు ఏర్పాటు చేసి, బాణసంచా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జనసంచార ప్రాంతాల్లో, వ్యవసాయ, అటవీ భూములలో అనధికారంగా విద్యుత్ తీగలు అమర్చి జంతువులు, మనుషులకు హాని కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణలో పాల్గొన్న ఉపసర్పంచ్‌లు, వార్డుమెంబర్లు

వై.రామవరం: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కె.బాపన్నదొర పర్యవేక్షణలో ఉప సర్పంచ్‌లు, వార్డుమెంబర్లకు ఈనెల 7వ తేదీన ప్రారంభమైన శిక్షణ తరగతులు మంగళవారంతో ముగిశాయి. ఈకార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు, జెడ్పీటీసీ కర్ర వెంకటలక్ష్మి, ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి ముఖ్య అతిథులుగాపాల్గొన్నారు . ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈశిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈవోపీఆర్‌డీ డి.శివ కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్ వ్యవస్థ, చట్టాలు, విధివిధానాలపై శిక్షణ ఇచ్చారు.

తపాలా శాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టల్ ఖాతాలను తెరిపిస్తున్న బీపీఎం రేఖ,ఏబీపీఎం కిషోర్

ముంచంగిపుట్టు:తపాలాశాఖ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జర్జుల బీపీఎం బి.రేఖ తెలిపారు. జర్జుల పంచాయతీలోని పలు గ్రామాల్లో పోస్టల్ పొదుపు ఖాతాలపై మంగళవారం ఆమె అవగాహన కల్పించారు. 10 ఏళ్లలోపు బాలికలకు సుకన్య సమృద్ధి యోజన పథకం వల్ల కలిగే మేలును తల్లిదండ్రులకు వివరించి, ఖాతాలను తెరిపించారు. ఏబీపీఎం కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

గొర్రె.. హుర్రే



- గొర్రెలు, మేకలకు భలే డిమాండ్
- సంతల్లో పెద్ద ఎత్తున నాటుకోళ్ల క్రయవిక్రయాలు
- పాడేరు నియోజకవర్గంలో రూ.6కోట్లకు పైగా లావాదేవీలు

జి.మాడుగుల: పాడేరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో నిర్వహించిన వారపు సంతల్లో గొర్రెలు, మేకలు, నాటుకోళ్లకు మంచి గిరాకీ ఏర్పడింది. దసరా సందర్భంగా వీటిని కొనుగోలు చేయడానికి జనం ఎగబడ్డారు. సాధారణ రోజులతో పోలిస్తే సుమారు 50 శాతం వరకు ధరలు పెరిగాయని అంటున్నారు. జి.మాడుగుల మండలం సంతబయలు, చింతపల్లి మండలం లోతుగెడ్డ జంక్షన్‌లో మంగళవారం, మద్దిగరువులో గురువారం, పాడేరులో శుక్రవారం, చింతపల్లి మండలం కోరుకొండ, మండల కేంద్రం కొయ్యూరులలో ఆదివారం, చింతపల్లిలో బుధవారం, లంబసింగిలో గురువారం, జీకే వీధి మండలం జీకే వీధి, సీలేరుల్లో జరిగిన సంతల్లో మేకలు, గొర్రెలు, నాటుకోళ్లు హాట్‌కేక్‌ల్లా అమ్ముడయ్యాయి. దీంతో పెంపకందారులు, వ్యాపారులు ఒక్కసారిగా ధర పెంచారు. ఈ ప్రాంతంలో నాణ్యత గల మేకలు, గొర్రెలు, నాటుకోళ్లు లభిస్తుండడంతో డిమాండ్ ఏర్పడింది. వీటిని కొనుగోలు చేసి మైదాన ప్రాంతాలకు వాహనాల ద్వారా తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రూ.6 కోట్ల లావాదేవీలు

పాడేరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో జరిగే వారపు సంతల్లో దసరా సందర్భంగా సంతల్లో రూ.6 కోట్ల వరకు మేకలు, గొర్రెలు, నాటుకోళ్ల క్రయవిక్రయాల లావాదేవీలు జరిగినట్టు అంచనా వేస్తున్నారు.

దసరాకు ముందు రెండు వారాల్లో నియోజకవర్గంలో జరిగిన వారపుసంతల్లో 5 వేల మేకలు, గొర్రెలు, 5 వేల నాటుకోళ్ల అమ్మకాలు జరిగాయి. మంగళవారం జరిగిన జి.మాడుగుల వారపుసంతలో ఒక కిలో నాటుకోడి రూ.900 నుంచి రూ.1,000, 10 కిలోల మేక, గొర్రె రూ.11,000 నుంచి రూ.12,000వరకు ధర పలికాయి. సుమారు 200 మేకలు, గొర్రెలు, 500 నాటుకోళ్ల విక్రయాలు జరగగా సుమారు రూ.30లక్షలు లావాదేవీలు జరిగినట్టు అంచనా.



జి.మాడుగుల వారపుసంతకు విక్రయించడానికి తీసుకు వచ్చిన మేకలు, గొర్రెలు



వారపుసంతలో అమ్మకానికి తీసుకు వచ్చిన నాటుకోడి పుంజులు

ధరలు బాగున్నాయి



మేకలు, గొర్రెలను సంవత్సరమంతా మేపి దసరా ముందు విక్రయిస్తాం. ఈ సారి మంచి రేటు లభించింది. నాటు కోడి పుంజు 2 కిలోలు రూ.1800కు, 9కిలోల మేక 9వేలకు విక్రయించాను.ఆశించిన ధర లభించడంతో చాలా సంతోషంగా ఉంది. ఈ సొమ్ముతో కుటుంబ అవసరాలు తీరుతాయి.

– రాజుబాబు, గడుతూరు, జి.మాడుగుల మండలం

పెంపకందారులకు లాభాలు



వినియోగదార్లు అవసరాలను బట్టి, డి మాండ్‌ను చూసి మేకలు, గొర్రెలు, నాటు కోళ్ల ధరలను పెంపకందార్లు పెంచేశారు. 10 కిలోల బరువున్న మేక, గొర్రెపోతులకు రూ.9వేలు నుంచి 10వేల వరకు ధర పలికింది. ప్రతి సంవత్సరం దసరాకు ముందు రెండు వారాలు వీటి ధరలు పెరుగుతాయి. పెంపకందారులకు మంచి లాభాలు వచ్చాయి.

–షేక్‌చిన్నరెహ్మాన్, వ్యాపారి, జి.మాడుగుల

వ్యాధులపై ఇంటింటా సర్వే

ఎటపాక: నెల్లిపాక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఎటపాకలో ఇంటింటా సర్వే నిర్వహించారు. వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలతో పాటు గర్భిణులు, బాలింతల వివరాలు సేకరించారు. మలేరియా,డెంగ్యూ,చికెన్‌గున్యా,టైఫాయిడ్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో హెచ్‌వీ సీతమ్మ,సిబ్బంది పార్వతి, తిరుపతమ్మ, లలిత,గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో, ఇతర సిబ్బంది

కొయ్యూరు: యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని ఏవో ఉమాదేవి తెలిపారు. రాజేంద్రపాలెంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అధిక మోతాదులో ఎరువులను వినియోగించరాదని సూచించారు. ప్రస్తుతం కొన్ని చోట్ల వరి పంట పొట్ట దశలో ఉందని,దీనికి ఎకరాకు 15 కిలోల ఎంవోపీ, 25 కిలోల యూరియా వేయాలని సూచించారు.

మట్టి అక్రమ రవాణాను అరికట్టాలి



ప్రభుత్వ భూమిలో మట్టి తవ్విన ప్రాంతం

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నాయి, వాటిని వెంటనే అరికట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మంగళవారం డిమాండ్ చేశారు. ఎటపాకలోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వి దానిని డాక్టర్ పాల్‌రాజ్ ఇంజినీరింగ్ కాలేజీ వెనుక అక్రమంగా నిల్వచేసి రాత్రి సమయంలో తెలంగాణ ప్రాంతానికి తరలించి అమ్ముకుంటున్నారని తెలిపారు. మట్టి అక్రమ రవాణా జరుగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. మట్టి దందాపై చింతూరు ఐటీడీఏ పీవో వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాలో 28 మంది ఎంపిక

చింతపల్లి: గిరిజన నిరుద్యోగ యువతకు పలు ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నట్టు ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి డాక్టర్ రోహిణి తెలిపారు. స్థానిక వైటీసీలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఆంధ్ర ప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ,జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ జాబ్‌మేళాకు పలు మండలాల నుంచి మొత్తం 80 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో విద్యార్హత, ప్రతిభ ఆధారంగా 28 మందికి పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలను కల్పించినట్టు రోహిణి తెలిపారు.ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధి కల్పన అధికారి సంగీత, ఈఎంఆర్ ప్రిన్సిపాల్ సతీష్, ఎస్‌బీ ఏఎస్‌ఐ రమణమూర్తి పాల్గొన్నారు.



ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులతో నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారులు

మండలాభివృద్ధికి కృషి చేయాలి

ముంచంగిపుట్టు: ప్రజలకు అందుబాటులో ఉంటూ మండలాభివృద్ధికి కృషి చేయాలని నూతన ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్షను ఎంపీపీ అరిసెల సీతమ్మ కోరారు. మంగళవారం నూతన ఎంపీడీవోను ఎంపీపీ,మండల వైఎస్సార్‌సీపీ నేతలు కలిసి పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలుతెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీటీసీలు,సర్పంచుల నుంచి పూర్తి సహకారం ఉంటుందన్నారు. ఎంపీటీసీగణపతి, జయదేవ్ పాల్గొన్నారు.



ఎంపీడీవోకు అభినందనలు తెలుపుతున్న ఎంపీపీ సీతమ్మ,నేతలు

ప్రత్యేక వైద్యశిబిరానికి స్పందన



గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చింతపల్లి: మండలంలోని కిటుములలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. సర్పంచ్ రమణమ్మ ఆధ్వర్యంలో జరిగిన ఈశిబిరంలో కల్వరి బాప్టిస్టు చర్చి ట్రస్టు నిర్వాహకుల ఆధ్వర్యంలో రోగులకు వైద్యాధికారులు పరీక్షలు జరిపారు అంజలీశనివారం, కిటుముల పంచాయతీల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 250 మందికి వైద్య సేవలందించారు. ఈకార్యక్రమంలో వైద్యాధికారులు ఆనంద్ మోహన్, రవికిరణ్, పద్మజ, వైఎస్సార్‌సీపీ నాయకులు పోతురాజు, నాగరాజు, నర్సింగరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన కల్పించాలి



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి

హుకుంపేట: మలేరియా,టైఫాయిడ్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని జిల్లా మలేరియా అధికారి తులసి ఆదేశించారు. మండలంలోని సూకురు పంచాయతీ చట్రాయిపుట్టు అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. అనంతరం ఆమె స్థానిక వైద్యాధికారులతో మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రత పాటించేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని సూచించారు.

ఖాళీ మద్యం సీసాలతో వినూత్న నిరసన



క్రికెట్ పిచ్ చుట్టూ క్రీడాకారులు పెట్టిన బీరు బాటిళ్లు

పాడేరు: ఖాళీ, విరిగిపోయిన మద్యం సీసాలతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులు, వాకర్లు వినూత్నంగా నిరసన తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కళాశాల మైదానం మందుబాబులకు నిలయంగా మారింది. ప్రతిరోజు రాత్రి పూట మందుబాబులు ఇక్కడి వచ్చి బహిరంగంగా మద్యం సేవిస్తున్నారు. మద్యం బాటిళ్లను పగులకొట్టడంతో పాటు మైదానంలో ఎక్కడబడితే అక్కడ సీసాలను విసిరేస్తున్నారు. దీంతో ప్రతి రోజు ఉదయం మైదానానికి వచ్చే క్రీడాకారులు, మార్నింగ్ వాకర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మందు బాబులకు ఎంత చెప్పినా వినడం లేదు. సోమవారం రాత్రి కూడా మందుబాబులు ఇక్కడ మద్యం సేవించడంతో క్రీడా మైదానంలో పెద్ద ఎత్తున ఖాళీ మద్యం బాటిళ్లు దర్శనమిచ్చాయి. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన క్రీడాకారులు, వాకర్స్ ఏకమై వాటిని పోగు చేసి క్రికెట్ పిచ్‌పై పేర్చి నిరసన తెలియజేశారు. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసులు స్పందించి మైదానంలో మందుబాబుల ఆగడాలు లేకుండా చూడాలని, క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో లైన్‌మేన్‌కు తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న లైన్‌మేన్ రాంబాబు



ప్రమాదానికి గురైన బైక్, వ్యాన్

రాజవొమ్మంగి : మండలంలోని జడ్డంగి శివారులో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లైన్‌మేన్‌గా పనిచేస్తున్న వల్లూరు రాంబాబు తీవ్రంగా గాయపడ్డాడు. రాజవొమ్మంగి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పనిచేస్తున్న చీపురుపల్లి గ్రామానికి చెందిన రాంబాబు మండలంలోని అమీనాబాద్‌కు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా సెల్ టవర్ సామగ్రితో వస్తున్న వ్యాన్ ఢీ కొనడంతో గాయపడ్డాడు. క్షతగాత్రుడిని స్థానికులు వెంటనే జడ్డంగి పీహెచ్‌సీకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం రాజమహేంద్రవరం తరలించారు.

మహాలక్ష్మీ నమోస్తుతే



మహాలక్ష్మి అలంకరణలో అరకులోయలోని భ్రమరాంబదేవి



మహాలక్ష్మి అలంకరణలో పాడేరులోని రాజరాజేశ్వరిదేవి



మహాలక్ష్మి అలంకరణలో సంగోడిలోని పార్వతీదేవి



చాపరాయిలో చేపపై కొలువైన చేపలమ్మ తల్లి



చింతపల్లి రంగా సెంటర్‌లో కరెన్సీ నోట్లతో దుర్గాదేవి



దూసరపాములో అమ్మవారు



కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించిన భక్తులు

- జిల్లా వ్యాప్తంగా ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సాక్షి,పాడేరు: శరన్నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించారు. పాడేరులోని రాజరాజేశ్వరిదేవి,కనకదుర్గమ్మ,సంగోడిలోని పార్వతీదేవితో పాటు అరకులోయలోని భ్రమరాంబదేవిని మహాలక్ష్మిగా అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాలక్ష్మిని దర్శించుకుని పూజలు చేశారు.భక్తులకు ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. అరకులోయలోని మల్లికార్జున సమేత భ్రమరాంబదేవి ఆలయంలో సాయంత్రం మహిళలు భజనలు చేశారు.

దుర్గమ్మకు మాజీ ఎమ్మెల్యే పూజలు

పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని కనకదుర్గమ్మతల్లి ఆలయంలో వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు,మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు జరిపారు.మహాలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన దుర్గమ్మకు కుంకుమార్చన చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలకు కొలువుదీరిన దుర్గమ్మతల్లి ఉత్సవ విగ్రహాన్ని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లాడ నగేష్, కొట్టగుళ్లి నాగేంద్ర,ఆలయ కమిటీ చైర్మన్ రొబ్బి రాము,ఇతర నాయకులు పాల్గొన్నారు.

కరెన్సీ నోట్లతో అలంకరణ

చింతపల్లి: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు చింతపల్లిలో ఘనంగా జరుగుతున్నాయి. స్థానిక రంగా సెంటర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపంలో మంగళవారం అమ్మవారిని కరెన్సీనోట్లతో అలంకరించారు.

వై.రామవరం: మండలంలోని వై.రామవరం, పి.యర్రగొండ, పనసలపాలెం, చవిటిదిబ్బలు, దేవరమడుగులు తదితర గ్రామాలు, సరిహద్దు ప్రాంతమైన వెదురు నగరంలో శ్రీసాయిరామ్ గురుస్వామి ఆశ్రమంలోని కాళీకామాత ఆలయంలోను శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వందలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేస్తున్నారు. మండలంలోని చవిటిదిబ్బలులో మంగళవారం కనకదుర్గమ్మవారికి వందమందికిపైగా భక్తులు బోనాలు సమర్పించారు. ఆలయకమిటీ సభ్యుల ఆధ్వర్యంలో బోనాలను ఊరేగించి, మండలంలోని దేవరమడుగులు శివారు పెద్దేరువాగులో నిమజ్జనం చేశారు.

రాజవొమ్మంగి : శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండలవ్యాప్తంగా దుర్గాదేవి ఆలయాల్లో మంగళవారం అమ్మవారికి విశేషపూజలు జరిగాయి. అమ్మవారు లక్ష్మీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. దూసరపాములో ఘనంగా గోపూజ నిర్వహించారు. రాజవొమ్మంగి, జడ్డంగి, శరభవరం, లబ్బర్తి, లాగరాయి, కిర్రాబు, కింద్ర తదితర గ్రామాల్లో దేవీనవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

దుంబ్రిగుడ: మండలంలోని చాపరాయిలో చేపపై కొలువైఉన్న చేపలమ్మ తల్లి, అరకు సంతలో కొలువైఉన్న విజయ దుర్గ పృథ్వేశ్వరిమాత ఆలయాల్లో మంగళవారం భక్తులు విశేష పూజలు జరిపారు. చాపరాయిలో పర్యాటక భక్తుడు 101 టెంకాయలు కొట్టి అమ్మవారి మొక్కును తీర్చుకున్నాడు. అరకు సంతలో డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఘటాలను ఊరేగిస్తూ భవానీ భక్తులు పూనకాలతో నృత్యాలు చేశారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు సూరజ్ త్రివేది ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సీలేరు: దసరా నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం జీకే వీధి మండలం దారకొండలో మహాలక్ష్మి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దారకొండకు చెందిన ఒక భవానీ భక్తుడు కరెన్సీనోట్లతో అమ్మవారిని అలంకరించాడు.



చాపరాయిలో 101టెంకాయలు కొడుతున్న భక్తులు



డప్పు వాయిద్యాలతో అమ్మవారి ఘటలను ఊరేగిస్తున్న భవానీ భక్తులు



కనకదుర్గమ్మను దర్శించుకున్న ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి, నరసింగరావు



దూసరపాములో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు